క్లుప్తంగా

ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహించండి



సిబ్బందితో మాట్లాడుతున్న మోహనరావు

పాలకొండ: రిమాండ్‌లో ఉన్న ఖైదీలకు నెలలో రెండు సార్లు వైద్య పరీక్షలు విధిగా నిర్వహించాలని జిల్లా జైళ్ల శాఖాధికారి కె. మోహనరావు అన్నారు. గురువారం స్థానిక సబ్ జైల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రిమాండ్ ఖైదీలతో మాట్లాడి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జైల్‌లో అందుతున్న వసతులపై ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని జైల్ సూపరింటెండెంట్ జోగులుకు సూచించారు.

సత్వరమే పరిష్కరించాలి



సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్ బాలమురళీకృష్ణ

పాలకొండ: రెవెన్యూ సదస్సుల్లో అందిన వినతులను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ బాలమురళీకృష్ణ ఆదేశించారు. మండలంలోని వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సుల్లో అందించిన ఫిర్యాదులు వివరాలు తెసుకున్నారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించాలని సూచించారు.

పరామర్శ

జియ్యమ్మవలస: మండలంలోని అల్లువాడ, అలమండ, గడసింగుపురం గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి పరామర్శించారు. గురువారం ఆయా గ్రామాల్లోని బాధిత కుటుంబాల ఇంటికి వెళ్లి, మృతి చెందిన వారి పట్ల సంతాపం ప్రకటించారు. బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ పరంగా అండగా ఉంటామని, ఏ అవసరం ఉన్నా తనను సంప్రదించాలని భరోసా ఇచ్చారు. ఆమె వెంట వైస్ ఎంపీపీ జి.సంపత్‌కుమార్, నాయకులు లోలుగు నారాయణరావు, మరడాన కిశోర్, అల్లు ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

సీపీఆర్‌తో ప్రాణరక్షణ

పాలకొండ రూరల్: గుండె పోటుకు గురైన బాధితుడికి తక్షణమే సీపీఆర్ చేయడం ద్వారా అతని ప్రాణాలకు రక్షణ కల్పించవచ్చుని ఆరోగ్యశ్రీ రీఫ్రెషర్ ట్రైనర్ ఆలుబిల్లి శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో 108 సిబ్బందికి ఆ సంస్థ జిల్లా మేనేజర్ ఎస్.మన్మధరావు నేతృత్వంలో శిక్షణ తరగతులు నిర్వహించారు ఈ క్రమంలో శిక్షకులు గుండె ఆగిన బాధితున్ని ఆస్పత్రికి తరలించే ముందు గోల్డెన్ అవర్ సమయంలో సీపీఆర్ చేయు విధివిధానాలపై, మానవ శరీర అంతర్ నిర్మాణాల పనితీరుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాసూరు విజయ్‌కుమార్‌తో పాటు ఎమర్జెన్సీ 108 మెడికల్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

పక్కాగా రికార్డులు నిర్వహించాలి

గరుగుబిల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులు పక్కాగా నిర్వహించాలని పార్వతీపురం మన్యం జిల్లా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టరు డాక్టర్ టి.కనకదుర్గ సూచించారు. మండలంలోని పెదగుడబ, ఉల్లిభద్ర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా గురువారం సందర్శించారు. ఆయా కేంద్రాల రికార్డులు, స్టాకు వివరాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు రక్తహీనతతో బాధపడకుండా చూడాలని, వారికి పౌష్టికాహారం సకాలంలో అందివ్వాలన్నారు. ఆమె వెంట పెదగుడబ ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ రౌతు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

గరుగుబిల్లి: సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ విజయ్ స్వరూప్ సూచించారు. మండల కేంద్రంలో ఎస్‌బీఐ, ఏపీజీవీబీ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. స్మార్ట్‌ఫోన్లకు వచ్చే అనవసరమైన లింకులు ఓపెన్ చేయొద్దన్నారు. స్టేట్‌బ్యాంక్ మేనేజర్ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన ఏమైనా వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ మేనేజర్ దీక్షిత, వెలుగు ఏపీఎం పెదిరెడ్ల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొండ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సీతంపేట మండల ఫీడర్‌కు శుక్రవారం విద్యుత్ సరఫ రా నిలిపి వేస్తున్నామని డీఈఈ టీజీకే మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు మండలంలోని సింగన్నవలస, పరశురాంపురం, వెలగవాడ, రుద్రిపేట, విజయరాంపురం, ఓని, గుడివాడ, లుంబూరు, సిరికొండ గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సైబర్ మాయాజాలంతో సామాన్యులు విలవిల..

- తెలియని నంబర్ల నుంచి వచ్చిన సమాచారం చూస్తే ఖాతాల్లో నగదు ఖాళీ
- లబోదిబోమంటున్న బాధితులు
- బ్యాంకులు, పోలీస్‌స్టేషన్ల చుట్టూ ప్రదక్షిణలు
- అప్రమత్తంగా వ్యవహరించాలంటున్న యంత్రాంగం





పాలకొండ రూరల్: సైబర్ నేరగాళ్ల మాయాజాలంలో పడి తరచూ సామాన్యులు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. సాంకేతికత మోజులో పడి స్మార్ట్‌ఫోన్లు వాడేవారు ఏమరుపాటుగా ఉంటే తమ బ్యాంక్ ఖాతాల నుంచి తెలియకుండానే నగదు మాయం అవుతున్న సంఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. పట్టణ వాసుల నుంచి గ్రామీణుల వరకు నగదు చెల్లింపు విషయంలో ఫోన్ పే, గూగుల్‌పేతో పాటు ఇతర సాంకేతిక వనరులను వినియోగిస్తుండడాన్ని నేరగాళ్లు వారికి ఆసరాగా మలుచుకుంటున్నారు. ఈ సమయంలో జరిగే లావాదేవీలు, వచ్చే ఓటీపీలు, పలు వ్యాపార, పార్ట్‌టైమ్, ఫుల్‌టైమ్ ఉద్యోగాలకు సంబంధించిన సమాచారాలు సెల్‌ఫోన్లకు తరచూ వస్తుంటాయి. వీటిని తెరచి చూసే సమయంలోనే భారీగా ప్రజలు సైబర్ నేరగాళ్ల వలకు చిక్కి విలవిల్లాడుతున్నారు. భారీగా నగదు వదిలించుకుని బ్యాంకులు, పోలీస్‌స్టేషన్ల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. ఆన్‌లైన్ గేమ్‌లు.. సులభపద్ధతిలో సొమ్ముపెడితే అధిక మొత్తం వస్తుందటూ ఆశచూపి వేలు, లక్షల రూపాయల్లో మోసం చేస్తున్నారు. పాలకొండ సబ్‌డివిజన్ పరిధిలో పాలకొండతో పాటు ఎల్విన్‌పేట, చినమేరంగి సర్కిళ్ల పరిధిలో గల 11 పోలీస్ స్టేషన్లలో గడచిన కొద్ది సంవత్సరాల్లో 21 సైబర్ నేరాలు నమోదైనట్లు పోలీస్ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో సాంకేతిక పరికరాల ద్వారా నగదు చెల్లింపులు చేసేవారితో పాటు స్మార్ట్‌ఫోన్లు వాడుతున్నవారు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

తాజాగా..

జిల్లా పరిధిలోని పలు స్టేషన్లలో తాజాగా సైబర్ నేరాలకు సంబంధించిన కేసులు విరివిగా నమోదవుతున్నాయి రెండు రోజుల కిందట పాలకొండ నగర పంచాయతీ పరిధిలోని కోమటిపేటకు చెందిన రోహిత్ అనే విద్యార్థి బ్యాంక్ ఖాతాలో రూ.30వేలు ఉండగా రాత్రి 2 గంటల సమయంలో పలు దశల్లో మొత్తం సొమ్ము ఇతరుల అకౌంట్‌కు మళ్లింపు జరిగింది. తన ప్రమేయం లేకుండానే అకౌంట్ నుంచి నగదు మాయమవుతుండడం, ఇందుకు సంబంధించిన మెసేజ్‌లు తన సెల్‌కు వస్తుండడంతో అయోమయానికి గురైన బాధితుడు పోలీసులను, బ్యాంక్‌ను ఆశ్రయించారు. అలాగే పట్టణంలోని నాగవంశపువీధికి చెందిన చిరంజీవి అనే వ్యక్తి ఆన్‌లైన్ ఉద్యోగాలకు సంబంధించిన సమాచారంతో వచ్చిన మెజేస్‌లను తెరిచాడు. అందులో ఉన్న లింక్‌లను క్లిక్ చేయడంతో రూ.70 వేలు కోల్పోయాడు. మండలంలోని అంపిలి గ్రామానికి చెందిన ఎల్. వెంకటరమణ అనే వ్యక్తి ఇదే తరహాలో ఆన్‌లైన్ టాస్క్‌లు నింపే క్రమంలో రూ.85 వేలు కోల్పోయాడు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. తెలియకుండా జరుగుతున్న సైబర్ మాయతో గ్రామీణులు భారీగానే నగదును నష్టపోవాల్సివస్తోంది.

పాటించాల్సిన జాగ్రత్తలు.

- సెల్‌ఫోన్లకు వచ్చే లింక్‌లు క్లిక్ చేయకుండా జాగ్రత్తగా గమనించి తెరవాలి.
- గుర్తు తెలియని వ్యక్తులకు ఆధార్ నంబర్లు, ఓటీపీలు, ఖాతా వివరాలు చెప్పకూడదు.
- యూపీఐ ద్వారా చెల్లించే బ్యాంకు ఖాతాల్లో తక్కువగా డబ్బు ఉండేలా చూసుకోవాలి.
- తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు ఇస్తామని చెప్పే వారి మాటలు, ప్రకటనలు నమ్మరాదు.
- గుర్తు తెలియని వ్యక్తుల కాల్స్, మేసేజ్‌కు స్పందించకూడదు.అలాగే మీ ప్రమేయం లేకుండా ఫోన్లో ఏదైనా యాప్ డౌన్‌లోడ్ అయిందా, లేదో ఎప్పటికప్పుడు చూసుకోవాలి.
- ఫోన్ వాడకుండానే చార్జింగ్ తగ్గుతుందంటే అనుమానించాల్సిందే.
- ఎవరైనా లాటరీ తగిలిందని.. ఆఫర్‌లో తక్కువ ధరకు వస్తువులు ఇస్తామని.. ఇన్సూరెన్స్ నగదు వేస్తామని చెబితే నమ్మరాదు.

అవగాహన కల్పిస్తున్నాం..



సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని చాలా మంది డబ్బులు. పోగొట్టుకుంటున్నారు. సైబర్ నేరగాళ్లతో ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి. ఎవరికి పడితే వాళ్లకు ఓటీపీలు చెప్పరాదు. ఆధార్ కార్డులు ఇవ్వరాదు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉంటూ సమస్యలు ఎదురైన కొద్ది సమయంలోనే 1930కి సమాచారం అందించడం ద్వారా నగదును నేరగాళ్ల ఖాతాలకు జమకాకుండా అడ్డుపడే అవకాశం ఉంటుంది. సైబర్ మోసాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

ఎం. రాంబాబు, సబ్‌డివిజన్ పోలీస్ అధికారి, పాలకొండ



విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు(ఫైల్)

స్పీకర్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

- సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల హెచ్చరిక



నిరసన తెలియజేస్తున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

సీతంపేట: షెడ్యూల్డ్ ఏరియాలో టూరిజం అభివృద్ధికి 1/70 చట్టం అడ్డంగా ఉందని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు వెంటనే ఉపసంహరించుకోవాలని మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం స్థానిక వైటీసీ వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గిరిజన హక్కులకు భంగం కలిగితే దశలవారీగా పోరాటం తప్పదన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి గిరిజనులకు నష్టం చేసేలా వ్యాఖ్యలు చేయడం అయ్యన్నపాత్రుడికి తగదని హితవు పలికారు. షెడ్యూల్డ్ ఏరియాలో ఆదివాసీల సహజసంపదను కార్పొరేట్ కంపెనీలు దోచుకుంటున్నాయని ఆరోపించారు. 1/70 చట్టం జోలికి వస్తే టీడీపీ ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉపకరణాల పంపిణీ నేడు

భామిని: మండలంలోని మనుమకొండ గ్రామ పంచాయతీలో దివ్యాంగులు, వయోవృద్ధులకు శుక్రవారం ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ కె.సత్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటల నుంచి 4 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు.

ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి

- జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, తదితరులు

పాలకొండ రూరల్: క్షేత్రస్థాయిలో కార్యదర్శులు వారికి అప్పగించిన విధులను ప్రణాళికాబద్ధంగా సకాలంలో పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి పి.కొండలరావు సూచించారు. గురువారం పాలకొండ వచ్చిన ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నియోజకవర్గ స్థాయి కార్యదర్శులతో పంచాయతీల వారీగా సమీక్ష చేపట్టారు. ముఖ్యంగా స్వమిత్వ సర్వేతో పాటు పల్లెల్లో పారిశుధ్య పనుల పురోగతి, పంచాయతీ రాజ్ (పీఆర్–1) యాప్, రానున్న వేసవి నేపథ్యంలో తాగునీటి వనరులు, రక్షిత ట్యాంకుల నిర్వహణ, ఖజానాకు జమ కావాల్సిన వివిధ రకాల పన్నుల వసూలుకు సంబంధించి ఈ సమీక్ష కొనసాగింది. కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, సకాలంలో లక్ష్యాలు పూర్తి చేయాలని సూచించారు. సమీక్షలో డివిజనల్ పంచాయతీ అధికారి నాగభూషణరావు, కార్యనిర్వహణాధికారి మురళి, ఎంపీడీఓ రంగారావు, ఈఓపీఆర్‌డీ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ పోరాటం స్ఫూర్తిదాయకం



గరుగుబిల్లి: గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ సంధ్యారాణి తదితరులు

గరుగుబిల్లి: అహింసా మార్గంలో దేశ స్వాతంత్య్ర సాధనకు మహాత్మాగాంధీ పోరాటం స్ఫూర్తిదాయకమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సంధ్యారాణి అన్నారు. మండల కేంద్రంలోని అదే విద్యాసంస్థ(గురుకుల పాఠశాల/కళాశాల)లో మహాత్మాగాంధీ వర్ధంతి గురువారం నిర్వహించారు. ప్రిన్సిపాల్, సిబ్బంది అంతా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. చంపారన్ సత్యాగ్రహం మొదలుకుని స్వాతంత్య్ర సాధన వరకు శాంతిమార్గంలో ఆయన చేసిన పోరాటాలు ఉద్యమ చరిత్రలో నూతన అధ్యాయమన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గరుగుబిల్లి శాఖ గ్రంథాలయం నిర్వాహకులు నల్ల మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

భామిని: మండలంలోని లివిరి ఎంపీయూపీ పాఠశాలలో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.అప్పారావు, ఉపాధ్యాయులు ఎల్.ప్రసాద్, హేమలత, రాజేఖరం, జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



ప్రజల ఆరోగ్యంపై ఆరాతీస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్‌మోహనరావు

కొమరాడ: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు సూచించారు. మండలంలోని చంద్రంపేట గ్రామాన్ని గురువారం సందర్శించిన ఆయన.. వైద్యారోగ్య సిబ్బంది చేపడుతున్న సర్వేలు, ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని, ఏవైనా వ్యాధులు, జ్వర లక్షణాలతో బాధపడుతున్న వారు ఆస్పత్రికి వెళ్లి, వైద్యసాయం పొందేలా చూడాలన్నారు. అలాగే నిత్యం ఆరోగ్య సలహాలు, సూచనలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎపిడిమిక్ ఈవో సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి



ఉపాధి హామీ పథకం మేట్లపై కూటమి నాయకులు చేస్తున్న కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సీపీఎం నాయకుడు కొల్లు సాంబమూర్తి కోరారు. ఇదే విషయమై కొమరాడ మండలంలోని అంటివలస గ్రామంలో విలేకరులతో గురువారం మాట్లాడిన ఆయన.. అధికారంలో ఉన్నాం.. మనల్ని ఎవరూ ఏం చేయలేరన్న అహంకారంతో అధికార పార్టీ నాయకులు ప్రవర్తిస్తున్నారని, తమకు గిట్టని వారిని వేధిస్తున్నారని ఆరోపించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న వారందరికీ 200 రోజుల పనిదినాలు కల్పించాలని, వేతనదారులకు పారలు, గునపాలు ఇవ్వాలన్నారు. -కొమరాడ

మేరీమాత సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే..



వీరఘట్టం మండలం యు.వెంకమ్మపేట వద్ద గురువారం జరిగిన మరియగిరి యాత్రను పురస్కరించుకుని కొండపై వెలసిన మేరీమాతను పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆమెతో పాటు ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు జంపు కన్నతల్లి ఉన్నారు. – వీరఘట్టం

సకాలంలో రేషన్ పంపిణీ చేయాలి

గుమ్మలక్ష్మీపురం: లబ్ధిదారులకు సకాలంలో రేషన్(నిత్యావసర సరుకులు) పంపిణీ చేయాలని తహసీల్దారు శివన్నారాయణ సూచించారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని తన కార్యాలయంలో రేషన్‌షాపు డీలర్లు, ఎండీయూ వాహనదారులతో గురువారం సమావేశమై, పలు సూచనలు చేశారు. రేషన్ సరుకుల పంపిణీలో సమయపాలన పాటించాలన్నారు. అలాగే సీజన్‌ల వారీగా ఉత్పత్తులను కొనుగోలు చేసి, జీసీసీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఉప తహసీల్దారు ఎన్.శేఖర్, గొడౌన్ సూపరింటెండెంట్ ఎం.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల విడుదల

పాలకొండ రూరల్: మత్స్యశాఖ పరిధిలో పీఎంఎంఎస్ (ప్రధానమంత్రి మత్స్య యోజన) పథకం ప్రాప్తికి మండలంలోని పలు చెరువుల్లో గురువారం చేపపిల్లలను విడిచిపెట్టారు. మత్స్యశాఖ జిల్లా అధికారి తిరుపతయ్య, అభివృద్ధి అధికారి గోపీకృష్ణ నేతృత్వంలో ఎన్కే రాజపురం, తంపటాపల్లి, నవగాం, పద్మాపురం గ్రామాల్లో గల అధికారిక చెరువుల్లో 89, 300 చేప పిల్లలను విడిచిపెట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలకు 60శాతం, బీసీలకు 40 శాతం రాయితీపై సీడ్ సరఫరా చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామీణ మత్స్యకార సహాయకులు శోభన్, ఆదినారాయణ, విజేత తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం ఇవ్వాలి

గుమ్మలక్ష్మీపురం: ఏనుగుల కారణంగా నష్టపోయిన పంటలకు సంబంధించి, బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కురుపాం మండలంలోని సీతంపేట, శివన్నపేట, గొళ్లవలస గ్రామాల రైతులు సింహాచలంనాయుడు, జి.రామకృష్ణ, ఎస్.నరసారావు, ఎం.శంకరరావు డిమాండ్ చేస్తున్నారు. వీరంతా గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని గురువారం కలిసి, విజ్ఞప్తులు చేశారు. తాము సాగు చేసుకుంటున్న పుచ్చకాయ, అరటి, బొప్పాయి తదితర పంటలను ఏనుగులు రెండు రోజుల క్రితం నాశనం చేశాయని, రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టామని వాపోయారు. పంట నష్టపరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఏనుగుల తరలింపు చర్యలు చేపట్టాలని వారు అభ్యర్థించారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు..



రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని మర్రిపాడు పీహెచ్‌సీని గురువారం సందర్శించి.. రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, మందుల నిల్వలపై ఆరా తీశారు. అనంతరం పూతికవలస సబ్‌సెంటర్, బాలికల ఆశ్రమ పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. - సీతంపేట

సమావేశం వాయిదా...

సీతంపేట:

మండల కేంద్రంలోని వైటీసీలో గురువారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశాన్ని ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాయిదా వేశారు. అయితే దూర ప్రాంతాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు బుధవారం సాయంత్రమే కార్యాలయానికి చేరుకున్నారు. మరుచటి రోజు సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ బి. ఆదినారాయణ, ఎంపీడీఓ కె. గీతాంజలి ప్రకటించడంతో అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ, ఎంపీడీఓలు మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎటువంటి తీర్మానాలు చేయకూడదని.. అందుకే వచ్చేనెల 20 తేదీకి వాయిదా వేసినట్లు చెప్పారు.

పామాయిల్ సాగుతో అదనపు ఆదాయం

- ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి



రైతు తోటలో పామాయిల్ మొక్క నాటుతున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: పామాయిల్ పెంపకంతో రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చని ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని చిన్నబగ్గ గ్రామంలో పామాయిల్ ప్లాంటేషన్‌ను గురువారం పరిశీలించారు. గిరిజన రైతులకు శతశాతం సబ్సిడీపై ఎకరాకు 50 మొక్కలు చొప్పున అధికారులు పామాయిల్ మొక్కలు పంపిణీ చేయగా.. వాటిని రెండెకరాల్లో నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంతకముందు సబ్సిడీపై సరఫరా చేసిన మారిషస్ పైనాపిల్ కూడా మంచి దిగుబడులు ఇస్తున్నాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అప్పలరాజు, పీహెచ్‌ఓ ఎస్వీ గణేష్, హెచ్‌ఓ జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న అపరాల పంటలు



సింగన్నవలస సమీపంలో అరకొరగా ఉన్న మినప మొక్కలు తీస్తున్న రైతులు

పాలకొండ: రైతులకు ఈ ఏడాది అపరాల పంట కంటనీరు తెప్పిస్తోంది. పెసర, మినప పంటలు పూర్తిగా దెబ్బతినడంతో దిగుబడి తగ్గిపోయింది. ప్రస్తుతం మండలంలో ముమ్మరంగా పెసర, మినప పంటల తీత పనులు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వం ఈ ఏడాది పంటల బీమా ఎత్తివేయడంతో నష్టపరిహారం అందే అవకాశం కూడా లేకపోయిందని రైతులు లబోదిబోమంటున్నారు. ఎకరం పొలంలో కనీసం క్వింటా దిగుబడి కూడా రాలేదని చెబుతున్నారు.

ప్రొటోకాల్ ఎందుకు ఉల్లంఘిస్తున్నారు..?

సీతంపేట:



ఎంపీడీఓను నిలదీస్తున్న వైస్ ఎంపీపీ సరస్వతి

ప్రజాప్రతినిధులను అధికారిక కార్యక్రమాలకు పిలవకుండా ప్రొటోకాల్ ఎందుకు ఉల్లంఘిస్తున్నారంటూ వైస్ ఎంపీపీ కుండంగి సరస్వతి ఎంపీడీఓ కె. గీతాంజలిని నిలదీశారు. గురువారం స్థానిక వైటీసీ వద్ద జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ... కొద్ది రోజుల కిందట స్థానికంగా నివాసముంటున్న డయాలసిస్ పేషెంట్ అచ్యుతరావుకు కొత్త పింఛన్ పంపిణీ చేసినప్పుడు అతని ఇంటికి కొద్ది దూరంలో ఉన్న తననెందుకు పిలవలేదని ప్రశ్నించారు. ఎటువంటి పదవులు లేని వారిచే పింఛన్లు పంపిణీ చేసి, ప్రజాప్రతినిధులమైన తమను అవమానపరుస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. మండల పరిషత్ ద్వారా పథకాల అమలుకు మంజూరైన నిధుల ఖర్చు వివరాలు కూడా తెలియజేయడం లేదన్నారు. దీనికి ఎంపీడీఓ గీతాంజలి బదులిస్తూ.. తాను ప్రొటోకాల్ ఉల్లంఘించలేదని, నిధుల విషయమై కార్యాలయానికి లిఖిత పూర్వకంగా రాసి ఇస్తే సమాధానం ఇస్తానని తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఏపీఓ ఈశ్వరమ్మ

పాలకొండ రూరల్: మండలంలోని ఓని, పెదకోటిపల్లి గ్రామాల్లో చేపడుతున్న సాగునీటి చానల్ పనులను ఉపాధి ఏపీఎం ఈశ్వరమ్మ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారుల హాజరు, మస్తర్లపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఉపాధి పనులను వేతనదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రస్తుతం 42 పనులు మండల పరిధిలో చేపడుతున్నట్లు వివరించారు. వేతనదారుల హాజరు, మస్తర్ల కేటాయింపుల్లో సాంకేతికత వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం మండల మహిళా సంఘాలకు ప్రత్యేక యాప్‌లను అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం సాగునీటి చానల్ పనులతో పాటు ఒక్కో పంచాయతీలో ఒక్కో చెరువు పనులు గుర్తించి వేతనదారులకు కేటాయిస్తామన్నారు.